# పాలస్తీనాపై సాగుతున్న ఇజ్రాయిల్ హత్యాకాండ




**2018** మార్చి 30 – మే 15 కాలంలో ఇజ్రాయిల్ సాయుధ బలగాలు పాలస్తీనా ప్రజలపై సైనిక దాడులు సాగిస్తూ, డ్రోన్లతో బాంబులు, భాష్పవాయు గోళాలు ప్రయోగిస్తూ హత్యాకాండ సాగించారు. మార్చి 30న ఇజ్రాయిల్ సైన్యం జరిపిన కాల్పులలో 27 మంది పాలస్తీనా ప్రజలు మరణించగా 1400 మంది ప్రజలు గాయపడ్డారు. మే 15న సాగించిన మారణకాండలో 60 మంది పాలస్తీనీయులు మరణించగా మరో 2200 మంది గాయాలపాలయ్యారు. భాష్పవాయువు సోకి మరణించినవారిలో ఎందరో పసిబిడ్డలు కూడా వున్నారు.

దశాబ్దాల కాలంగా పాలస్తీనా ప్రజలు తమ మాతృభూమి కోసం చేస్తున్న పోరాటం కొనసాగుతూ వుంది. ఇంతకాలంగా సామ్రాజ్యవాదశక్తులు ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదులు పాలస్తీనాపై అన్నిరకాల దాడులు చేయటానికి ఇజ్రాయిల్ పాలకులకు తమ సంపూర్ణ మద్దతును అందజేస్తూ పాలస్తీనా ప్రజలపై అన్ని తరహాల నేరాలకు పాల్పడుతున్నారు. మరోవైపున పాలస్తీనా ప్రజలను చీల్చి వారి పోరాటాన్ని బలహీనపరచటం ద్వారా వారిని ఓ నిస్సహాయ స్థితికి నెట్టాలని, ఆ స్థితిలో ఇజ్రాయిల్ పాలకులకు ఎక్కువ అనుకూలంగా వుండే ఓ పరిష్కారాన్ని పాలస్తీనా ప్రజలపై రుద్దేందుకు సామ్రాజ్యవాదులు ప్రయత్నిస్తున్నారు.

పాలస్తీనాలో కొన్ని ప్రాంతాలలో హమస్, మరికొన్ని ప్రాంతాలలో పాలస్తీనా అథారిటీ పాలన సాగిస్తున్నాయి. అయితే ఈ ప్రాంతాలన్నీ ఇజ్రాయిల్ పాలకులచే నిరంతరాయంగా దాడులకు, దురాక్రమణకు గురవుతున్నాయి. వివిధ సందర్భాలలో ఈ విధంగా బలప్రయోగంతో తమ భూములనుండి, ఇళ్ల నుండి గెంటివేయబడిన లక్షలాదిమంది ప్రజానీకం తమ స్వస్థలాలకు, స్వగృహాలకు తిరిగి వెళ్ళటానికి సిద్ధంగా వున్నారు.

మొదటి అరబ్ – ఇజ్రాయిల్ యుద్ధ కాలంలో గాజా ప్రాంతవాసులలో అత్యధికులు లేదా వారి సంతతి 'శరణార్థులు'గా వున్నారు. ఈ 'శరణార్థులు' ఇజ్రాయిల్ పాలకుల క్రూర చర్యలకు, దాడులకు నిరంతరంగా గురౌతూ దుర్భరమైన పరిస్థితుల్లో కాలమెళ్ళదీస్తున్నారు. 2009లో ఇజ్రాయిల్ సైనిక బలగాలు గాజా ప్రాంతంపై సైనిక దురాక్రమణకు పాల్పడి సామూహికంగా ప్రజలను హత్యగావించాయి. కనుక ఈ పరిస్థితులలో తమ జీవితాలను, ఇళ్ళను, జీవనాధారాలను కాపాడుకోవటం కోసం చేసే పోరాటమే పాలస్తీనా ప్రజల జీవనంలో ఒక భాగంగా మారిపోయింది.

ఒక దశాబ్ద కాలంగా గాజా ప్రాంత ఇజ్రాయిల్ సరిహద్దులలోని 225 కి॥మీ పొడవునా ఇజ్రాయిల్ పాలకులు దోవ మూసివేశారు. ఈ దిగ్బంధంలో ఇటీవల ఈజిప్టు కూడా తోడైంది. ప్రత్యేకించి ఈ దిగ్బంధాల కారణంగా ఈ ప్రాంత ప్రజలకు మిగతా ప్రపంచంతో సంబంధాలు లేకుండా జీవించాల్సి వస్తోంది. గాజా ప్రాంతం నుండి ప్రజలు, వస్తువుల రాకపోకలను ఈ దిగ్బంధాలు భారీగా నిరోధించి వేశాయి. వాస్తవానికి ఈ ప్రాంతం మొత్తాన్ని పాలస్తీనా ప్రజల బహిరంగ కారాగారంగా మార్చివేశాయి.

కనుక, పాలస్తీనా ప్రజలు 2018 మార్చి 30 నుండి, ఇజ్రాయిల్ – పాలస్తీనా సరిహద్దులలోని 225 కి॥మీ పొడవునా ఆరు వారాల పాటు బైఠాయింపు, నిరసన ప్రదర్శనలు ప్రారంభించారు. ఇజ్రాయిల్ దిగ్బంధాన్ని ఎత్తివేయాలనే డిమాండ్‌తో పాటుగా 1948లో ఇజ్రాయిల్ యూదు పాలకులు బలప్రయోగంతో గెంటివేసిన పాలస్తీనా ప్రజలంతా తిరిగి వారి స్వస్థలాలకు చేరుకునే హక్కుకు మద్దతుగా వారు ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమంలో సుమారు 40 వేల మంది పాలస్తీనా ప్రజలు పాల్గొన్నారు. 'స్వస్థలాలకు తిరిగి వెళ్ళే భారీ కవాతు'గా దీనిని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం మే 15న ముగిసే విధంగా రూపొందించారు. మే 15 తేదీని పాలస్తీనా ప్రజలు 'నక్బా' లేక 'విపత్తు దినం'గా పరిగణిస్తారు. 1948లో ఈ దినాన లక్షలాది మంది పాలస్తీనా ప్రజలు తమ స్వస్థలాల నుండి బలప్రయోగంతో గెంటివేయబడ్డారు.

అయితే ఇజ్రాయిల్ సైనిక బలగాలు శాంతియుతంగా ప్రదర్శన సాగిస్తున్నవారిపై మార్చి 30న విచక్షణా రహితంగా జరిపిన కాల్పులలో 27 మంది ప్రజలు మరణించారు. సైనికులు భాష్పవాయు గోళాలను ప్రయోగించి 1400 మంది ప్రజలను గాయపరిచారు. ప్రపంచవ్యాపితంగా వున్న మానవ హక్కుల సంస్థలు, విస్తృత ప్రజానీకం ఈ క్రూరమైన దాడులను, హత్యలను తీవ్రంగా ఖండించారు.

అయితే ఎప్పటిలాగానే ఇజ్రాయిల్ పాలకులు, పాలస్తీనా ప్రజలపై తమ సైనిక బలగాలు సాగించిన నేరాలకు బాధ్యత తీసుకోకుండా అహంకార పూరితంగా నిరాకరించారు. సరిహద్దులను రక్షించేందుకు అవసరమైన చర్యలు చేపట్టినందుకు

పతకాన్ని బహుకరించేందుకు "ఇజ్రాయిల్ సైనికులు యోగ్యులు" అని ఇజ్రాయిల్ రక్షణశాఖ మంత్రి పేర్కొన్నాడు. ఈ హత్యాకాండపై స్వతంత్ర విచారణ కోరుతూ 2018 మార్చి 31న కువైట్ రూపొందించిన ఓ ముసాయిదాను ఐక్యరాజ్య సమితి భద్రతా సమితిలో ప్రవేశ పెట్టనీయకుండా అమెరికా నిరోధించింది.

"విపత్తుదినం"గా పాటిస్తున్న మే 15వ తేదీన సరిహద్దు పొడవునా సాగిస్తున్న ఈ నిరసనాందోళన ముగియనున్న దశలో అమెరికా అధ్యక్షుడు మరో ఘోరమైన నిర్ణయానికి కార్యరూపమిచ్చారు. ఇజ్రాయిల్‌లోని అమెరికా రాయబార కార్యాలయాన్ని టెల్ అలీవ్ నుండి జెరూసలెంకు మారుస్తున్నట్లుగా 2017 డిసెంబర్6న చేసిన ప్రకటనను అమెరికా 2018 మే 14న ఆచరణలోకి తెస్తున్నట్లుగా ప్రకటించింది. అంటే, ఇజ్రాయిల్ రాజధానిగా జెరూసలెంను ప్రకటించటమన్నమాట! ప్రపంచ వ్యాపితంగా పలు దేశాల నేతలు, పాలస్తీనాతో సహా అనేక దేశాల ప్రజానీకం అమెరికా యొక్క ఈ చర్యను ఖండిస్తూ గట్టి నిరసన తెలిపారు. అమెరికా ఏకపక్షంగా ఆధిపత్య ధోరణితో ఈ చర్య చేపట్టింది. పాలస్తీనా అంశానికి దీర్ఘకాలం మనగలిగే, హేతుబద్ధమైన పరిష్కారం కోసం సాగుతున్న చర్చల క్రమాన్ని నాశనం చేసి, ముందుకు సాగనీయకుండా వుండేందుకే అమెరికా ఈ తరహా మొరటైన మార్గాన్ని ఎంచుకుంది. ఇజ్రాయిల్ రాజధానిగా జెరూసలెంను గుర్తిస్తున్న అమెరికా చర్యను వ్యతిరేకిస్తూ పాలస్తీనా ప్రజలు ప్రస్తుతం తాము సాగిస్తున్న నిరసన కార్యక్రమాన్ని విస్తరించారు. అమెరికా దుర్మార్గ చర్యకు వ్యతిరేకంగా ఇచ్చిన పిలుపుకు స్పందించి భారీ స్థాయిలో పాలస్తీనీయులు వీధుల్లోకి వచ్చారు. ఈ సందర్భంలోనే తిరిగి 2018 మే 15న పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ పాలకులు సైనిక దాడులు, హత్యాకాండ సాగించి 60 మందిని బలిగొన్నారు. అయినా పాలస్తీనా ప్రజలు నిశ్చయాత్మకంగా నిలచి వున్నారు. ఇజ్రాయిల్ హత్యాకాండను ఖండిస్తూ చేతుల్లో జెండాను పట్టుకొని 'అమరులారా మీ స్ఫూర్తితో ముందుకు సాగుతాం. పోరాటాన్ని కొనసాగిస్తాం. లక్ష్యాన్ని సాధిస్తామంటూ' నినాదాలు చేస్తూ వేలాదిమంది ప్రజానీకం మృతుల అంతిమ యాత్రలో పాల్గొని నివాళు లర్పించారు.

కనుక, తమ న్యాయమైన హక్కుల కోసం పోరాటాన్ని ముందుకు కొనసాగించటం మినహా పాలస్తీనా ప్రజలకు మరో మార్గం లేదు.

1. ఎలాంటి నియమాలు విధించకుండా గాజా నుండి పాలస్తీనా ప్రజలు రాకపోకలు సాఫీగా సాగించేందుకు వీలుగా ఇజ్రాయిల్ పాలకులు విధించిన దిగ్బంధాన్ని ఎత్తివేయాలి.
2. 2018 మార్చిలో, మేలో ప్రజల ప్రదర్శనలపై సైనిక దాడులు సాగించి పాలస్తీనా ప్రజలను హత్యగావించినవారిని తగినవిధంగా శిక్షించాలి.
3. 1948 నుండి వివిధ దఫాలుగా తమ స్వస్థలాల నుండి గెంటివేయబడిన పాలస్తీనా ప్రజలు తమ స్వస్థలాలకు, స్వగృహాలకు సంపూర్ణ హక్కులతో తిరిగి వెళ్ళటానికి అనుమతించాలి.

ఈ డిమాండ్లతో ముందుకు సాగుతున్న పాలస్తీనా ప్రజల నిరసనోద్యమానికి న్యాయాన్ని, శాంతిని కాంక్షించే ప్రజలందరూ తమ మద్దతును, సంఘీభావాన్ని అందించాలి.

తమ మాతృభూమిని తిరిగి పొందటం కోసం ఇజ్రాయిల్ పాలకులకు వ్యతిరేకంగా పాలస్తీనీయులు చేస్తున్న పోరాటం, సామ్రాజ్యవాద ఆధిపత్య రాజకీయాలకు వ్యతిరేకంగా సాగించే పోరాటంతో అవిభాజ్యంగా ముడిపడి వుందని మున్నెన్నటికంటే గాఢంగా నేడు వారు గుర్తించగలుగుతున్నారు.

ooooo